సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



విద్యార్థులకు అల్పాహారం..
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు శుక్రవారం నుంచి అల్పాహార పథకానికి శ్రీకారం చుడుతున్నారు. 8లో



100 కేజీల గంజాయి సీజ్
పాల్వంచ మండలం నాగారంలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న 100 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
34° / 21°
జిల్లాలో శుక్రవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రికి వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రామయ్య శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం హైదరాబాద్ విద్యానగర్ కాలనీకి చెందిన బంగారురాజు – మల్లేశ్వరి దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాతలకు అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆలయ సిబ్బంది సాయిబాబా పాల్గొన్నారు.


పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు గురువారం అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. పూజల్లో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లికి రూ.69వేల విలువైన బంగారు గొలుసును ఖమ్మం శ్రీనగర్‌కాలనీకి చెందిన ఎం.డీ.జానీవియా దంపతులు గురువారం అందజేశారు.

ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా మాధవరావు



డాక్టర్ మాధవరావు

ఖమ్మం వైద్యవిభాగం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా డాక్టర్ మాధవరావు నియమితులయ్యారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా ఆయన 2013లో ఉద్యోగ విరమణ పొందారు. ఆతర్వాత ఖమ్మం జిల్లా ఎపిడమాలజిస్ట్‌గా పదేళ్ల పాటు విధులు నిర్వర్తించారు. ఈమేరకు ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా నియమించగా గురువారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆతర్వాత కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలవడమేకాక ఉద్యోగులతో సమావేశమై ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను పరిశీలించి సేవలపై ఆరా తీశారు.

నేటి నుంచి పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని కేయూ పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఎంకాం, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్‌లో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన కామన్ పీజీ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌లో తమ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం కళాశాలలో కానీ 98492 50633 నంబర్‌లో కానీ సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎవరెవరు... ఇంకెప్పుడు?!

కాంగ్రెస్‌లో టికెట్.. టెన్షన్
- ఢిల్లీ, హైదరాబాద్ చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- పాలేరులో ఓ పక్క తుమ్మల, ఇంకో పక్క పొంగులేటి ప్రచారం
- మిగతా చోట్ల 'గడపగడపకూ కాంగ్రెస్'తో ప్రజల్లోకి నేతలు
- ముఖ్య నేతలు పోటీ చేసే స్థానాలపై అస్పష్టత
- సీపీఎం, సీపీఐ పొత్తుపై తొలగని ప్రతిష్టంభన



రేపోమాపో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందన్న ప్రచారం.. ఇంకోపక్క కాంగ్రెస్ – కమ్యూనిస్టుల పొత్తుపై ఢిల్లీ స్థాయిలో సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందన్న సమాచారం.. అయినా టికెట్లు ఖరారు కాకపోవడంతో 'హస్తం' ఆశావహుల్లో ఆందోళన నెలకొనగా, టికెట్ ఖరారు చేసుకునేందుకు ఢిల్లీ, హైదరాబాద్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంకొందరు నేతలు గడపగడపకూ కాంగ్రెస్ పేరిట నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. కాగా, కాంగ్రెస్‌లో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ నియోజకవర్గం నుంచి బరిలో ఉంటారనేది తేలకున్నా ఇద్దరూ పాలేరులో జోరుగా ప్రచారం చేస్తున్నారు.
– సాక్షిప్రతినిధి, ఖమ్మం

భారీగా ఆశావహులు..
మునుపెన్నడూ లేనివిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య సెంచరీ దాటింది. పది నియోజకవర్గాలకు 120 మంది వరకు దరఖాస్తు చేసుకోగా నియోజకవర్గానికి ఒకరిద్దరు అభ్యర్థులతో రాష్ట్ర స్థాయిలో జాబితా సిద్ధం చేసినా ఢిల్లీలో సెంట్రల్ స్క్రీనింగ్ కమిటీ భేటీల్లో టికెట్ల ఖరారుకు సమయం పడుతోంది. ఈ క్రమాన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశావహులు టికెట్ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. జనరల్ స్థానాల కన్నా రిజర్వ్‌డ్ స్థానాల్లో టికెట్ ఆశిస్తున్న వారు అత్యధికంగా దరఖాస్తు చేసుకున్నారు. ఇల్లెందు, వైరా, పినపాక, అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం నేతలు పాట్లు పడుతున్నారు.

జనరల్ స్థానాలపై చర్చ..
ఉమ్మడి జిల్లాలోని మూడు జనరల్ స్థానాల్లో ఖమ్మం తరఫున పోటీ చేసేది ఎవరనే అంశంపై చర్చ సాగుతోంది. మధిర, భద్రాచలం సీట్లు సీఎల్పీ నేత భట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు ఖరారైనట్లే. మరో ఎనిమిది స్థానాల్లో అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. ఇందులో రెండు చోట్ల నుంచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోటీ చేయడం ఖాయమైంది. అయితే, ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం మాత్రమే జనరల్ స్థానాలు కాగా వీరిద్దరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్నది హాట్‌టాపిక్‌గా మారింది. ఇక మిగిలిన రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా అభ్యర్థుల ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ వడపోత తీవ్రతరం చేసినట్లు తెలుస్తోంది. వారంలోగా అభ్యర్థుల ఎంపిక పూర్తిచేయడమే కాక టికెట్ దక్కని వారిని బుజ్జగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టేందుకు అధిష్టానం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

కమ్యూనిస్టుల పొత్తుతో..
గతంలో కమ్యూనిస్టులతో పొత్తుపై కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో చర్చలు జరిపినా ఓ కొలిక్కి రాలేదు. తాజాగా ఢిల్లీ స్థాయిలో జరిగిన చర్చల్లో సూత్రప్రాయంగా పొత్తుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మంలో కమ్యూనిస్టులకు కొంత బలం ఉండడం.. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు ఉమ్మడి జిల్లా వాసులే కావడంతో కమ్యూనిస్టులకు ఏయే సీట్లు కేటాయిస్తారోనని కాంగ్రెస్ నేతలు హడలిపోతున్నారు. సీపీఐ కార్యదర్శి కూనంనేని కొత్తగూడెం నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. సీపీఎం నేతలు పాలేరు సహా ఒకటి, రెండు సీట్లు ఆశిస్తున్నారు. ఇలా జనరల్ స్థానాలు రెండింటినీ కమ్యూనిస్టులకు కేటాయించేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఒప్పుకోకపోవచ్చనే వాదన వినిపిస్తోంది. మరోపక్క సీపీఎం, సీపీఐతో పొత్తు కుదురుతుందా, లేదా అనే సందిగ్ధత కూడా నెలకొంది. అలాగే, జనరల్ స్థానమైన కొత్తగూడెం నుంచి ఆశావహులు ఎక్కువగా ఉండడం.. బీసీ, మాదిగ సామాజిక వర్గం నేతలు కూడా తమకు టికెట్ కేటాయించాలనే డిమాండ్ తెరపైకి తీసుకొచ్చిన నేపథ్యాన పొత్తు కుదురుతుందా, లేదా.. టికెట్ల కేటాయింపు ఎప్పుడు చేస్తారోనన్న ప్రశ్నలు ఆశావహులను వేధిస్తున్నాయి.

ఆ ఇద్దరి దృష్టీ పాలేరు పైనే !



మాజీ మంత్రి తుమ్మల, మాజీ ఎంపీ పొంగులేటి పాలేరుపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. రెండు రోజులుగా మాజీ మంత్రి తుమ్మల గడపగడపకూ కాంగ్రెస్ పేరుతో నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. అలాగే, పొంగులేటి సైతం కాంగ్రెస్ కార్యకర్తలతో భేటీ అవుతున్నారు. వీరిద్దరూ స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిపై విమర్శలు ఎక్కుపెడుతుండగా.. పాలేరు నుంచే పోటీకి మక్కువ చూపుతున్నట్లు అర్థమవుతోంది. కాగా, పొంగులేటి పాలేరు, ఖమ్మం, కొత్తగూడెంలో పోటీకి దరఖాస్తు చేసుకున్న నేపథ్యాన పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం నుంచి ఎవరు బరిలోకి దిగుతున్నారన్నది అధిష్టానం ప్రకటనతో తేలిపోనుంది.

ఓటు హక్కు కల్పించడం అభినందనీయం



ఓటుహక్కు పొందిన కొండరెడ్లు, విజేతలతో కలెక్టర్, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొండరెడ్లకు ఓటు హక్కు కల్పించడం పట్ల కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్ కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలను అభినందించారు. హైదరాబాద్‌లోని టెక్ మహీంద్రా లెర్నింగ్ కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఓటుహక్కు నమోదు, వినియోగం తదితర అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా సీఈసీ మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లాలో కొండరెడ్లకు ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల ద్వారా 692 మంది ఓటుహక్కు పొందారని చెప్పారు. మారుమూలన నివసిస్తున్న ప్రజలకు ఓటుహక్కు కల్పించడానికి ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. కాగా, ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండలానికి చెందిన కొండరెడ్లు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అలరించింది. సీఈసీ రాజీవ్ కుమార్, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పోటీల విజేతలను, కొత్తగా ఓటుహక్కు పొంది గిరిజన నృత్యంతో అలరించిన కొండరెడ్లను అభినందించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి త్రినాథ్‌బాబు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి



మాట్లాడుతున్న జడ్జి సూరిరెడ్డి

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా సూరిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భద్రాచలం కోర్టు ఆవరణలో ఇన్‌చార్జ్ న్యాయమూర్తి వెంకటేశ్వర్లు సూరిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది నుంచి మెజిస్ట్రేట్‌గా సూరిరెడ్డి ఎదగడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, కార్యదర్శి నవీన్, న్యాయవాదులు శ్రీనివాసన్, కిషోర్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

12న రైల్వే స్టేషన్ ముట్టడి

అఖిలపక్షం నేతల వెల్లడి



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 12వ తేదీన భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌ను ముట్టడిస్తామని అఖిలపక్ష నాయకులు తెలిపారు. గురువారం కొత్తగూడెం రైటర్‌బస్తీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరోనా కంటే ముందుగా భద్రాచలం రోడ్ స్టేషన్‌కు ఏడు రైళ్లు వచ్చేవని, కానీ ప్రస్తుతం ఉదయం ఒకటి, రాత్రి ఒక రైలు మాత్రమే వస్తున్నాయని, మిగతా వాటిని రద్దుచేసి బొగ్గు రవాణా కోసమే ఈ స్టేషన్‌ను నిర్వహిస్తున్నారని విమర్శించారు. రైల్వే అధికారులు ఆదాయం కోసమే చూస్తున్నారు తప్ప, ప్రయాణికుల సౌకర్యాల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత వందేళ్లుగా దక్షిణ మధ్య రైల్వేకు అత్యధిక ఆదాయం సంపాదించి పెట్టిన ఏకైక రైల్వే స్టేషన్ కొత్తగూడెమేనని వివరించారు. అయినా ఈ స్టేషన్‌పై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, అత్యధిక జనాభాతో పాటు పారిశ్రామికంగా ఈ ప్రాంతం పేరు గాంచిందని, భద్రాచలం రాముల వారి సన్నిధికి వచ్చే యాత్రీకులకు సౌకర్యం లేకుండా ప్యాసింజర్ రైళ్లు కూడా రద్దు చేశారని తెలిపారు. గత రెండేళ్లుగా ఎంతగానో పోరాడితే బెళగావి ట్రైన్ వేసి, అది కూడా రద్దు చేశారని వాపోయారు. వీటన్నింటినీ నిరసిస్తూ 12వ తేదీన భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌ను ముట్టడిస్తున్నామని, అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు, అఖిలపక్ష నాయకులు శ్రీనివాసరెడ్డి, జమలయ్య, అన్నవరం సత్యనారాయణ, లిక్కి బాలరాజు, బానోతు ధర్మా, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



సమ్మె విరమిస్తున్నట్లు లేఖ అందజేస్తున్న ప్రతినిధులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంటౌన్: జిల్లా వ్యాప్తంగా సమ్మెతో మూతపడిన అంగన్‌వాడీ సెంటర్లు 24 రోజుల తర్వాత గురువారం తెరుచుకున్నాయి. దీంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. తాము సమ్మె విరమించి విధులకు హాజరవుతున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జిల్లా సంక్షేమశాఖ అధికారి విజేతకు అందజేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లకు చేరుకున్న చిన్నారులకు చదువు చెప్పడంతో పాటు బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం, యుక్త వయసు అమ్మాయిలకు కిశోరామృతం అందజేశారు.

కలెక్టరేట్ వద్ద సంబురాలు
సమస్యల పరిష్కారం కోసం 24 రోజుల పాటు నిరవధిక సమ్మె చేసిన అంగన్‌వాడీలు రాష్ట్ర మంత్రుల హామీతో సమ్మె విరమించి గురువారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. స్వీట్లు పంచుకున్నారు. సమ్మెకు సహకరించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా నాయకులు రెడ్డి అరుణ, గోనె మణిని వారు సన్మానించారు. తమకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి.మల్లికార్జున్, కంచర్ల జమలయ్య, గోనె మణి, రెడ్డి అరుణ, భూక్య లలిత, విజయ, ఇందిర, సంధ్య, భారతి, సునీత, జయ, సావిత్రి, మాధవి, రూప తదితరులు పాల్గొన్నారు.

బొబ్బతెగులు ఉధృతిని అరికట్టొచ్చు



మిరపతోటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

చంద్రుగొండ : మిర్చి పంటలో బొబ్బతెగులు ఉధృతిని సస్యరక్షణ, యాజమాన్య పద్ధతుల ద్వారా అరికట్టవచ్చని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ నారాయణమ్మ తెలిపారు. మండలంలోని గానుగపాడులో శాస్త్రవేత్తలతో కలిసి గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ప్రధానంగా చంద్రుగొండ మండలంలో బొబ్బతెగులు ఉధృతి అధికంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తెల్లదోమ ఆశించడం ద్వారా ఈ తెగులు వస్తుందన్నారు. తెల్లదోమ నివారణకు రైతులు తెలుపు, పసుపు, నీలం రంగు అట్టలను తోటల్లో ఎకరాకు 50 చొప్పున ఏర్పాటు చేయాలని సూచించారు. తెగుళ్ల నివారణకు పిచికారీ చేయాల్సిన రసాయనాల గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శివ, నవీన్‌కుమార్, ఏఓ వినయ్, ఏఈఓలు శ్రీనివాసరావు, విజయ్, సాయిభాను పాల్గొన్నారు.

ఇల్లెందుకు ఐటీఐ మంజూరు

ఇల్లెందు: ఇల్లెందుకు ఐటీఐని మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి కల్పన, శిక్షణ విభాగం ఉన్నతాధికారులు ఇల్లెందులో ఐటీఐ కళాశాల ఆవశ్యకతను గుర్తించి, ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచారు. పరిశీలించిన ప్రభుత్వం పరిపాలనా పరమైన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.11.52 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, స్మార్ట్ అగ్రికల్చర్, ఫ్యాషన్ డిజైనర్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ వంటి ట్రేడ్లను కూడా మంజూరు చేశారు. ఇల్లెందుకు ఐటీఐ మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ హర్షం వ్యక్తం చేశారు.

అడవుల సంరక్షణే ధ్యేయం



గుండెపుడి అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ

జూలూరుపాడు: అడవుల సంరక్షణ, అభివృద్ధే ధ్యేయమని జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్ అన్నారు. జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని కనకగిరి రిజర్వు ఫారెస్ట్‌లోని ప్లాంటేషన్, అటవీ సంపద, జంతువుల కోసం ఏర్పాటు చేసిన రక్షణ చర్యలను, జూలూరుపాడు అటవీ నర్సరీని గురువారం ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవల్సిన చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, డీఆర్‌ఓలు ధనలక్ష్మి, లక్ష్మీనర్సు, సెక్షన్ అధికారి మల్లయ్య, బీట్ ఆఫీసర్లు రేఖ, భూక్యా నరసింహారావు, డి.కిషన్, చింతా వెంకటేశ్వర్లు, రహీం పాల్గొన్నారు.

దశా'దిశ' లేదు !

- జాడలేని సమన్వయ కమిటీ సమావేశం
- పథకాల అమలుపై పర్యవేక్షణ కరువు



గతేడాది దిశ సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

చుంచుపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి, సమన్వయ మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశం జాడే లేదు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో 22 శాఖల్లో పథకాలు అమలవుతున్నాయి. అవి సక్రమంగా అర్హులకు అందించేలా ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేసేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించి పథకాల అమలుపై సమీక్ష చేయాలి. కానీ జిల్లాలో గతేడాది నవంబర్‌లో చివరి దిశ కమిటీ సమావేశం నిర్వహించారు. దాదాపు ఏడాది కావస్తున్నా మళ్లీ ఆ ఊసే ఎత్తడం లేదు.

ఏడేళ్లలో ఏడుసార్లే..
ప్రతీ మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశం నిర్వహించి కేంద్ర పథకాలపై పూర్తిస్థాయిలో సమీక్షించాల్సి ఉంటుంది. ఈ సమావేశానికి మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. కమిటీలో ఎమ్మెల్యేలు, కొందరు ఎంపీపీలు, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు. 2016 అక్టోబర్‌లో భద్రాద్రి జిల్లా ఆవిర్భవించింది. జిల్లా ఏర్పాటై ఏడేళ్లు కావస్తుండగా ఇప్పటి వరకు ఏడుసార్లు మాత్రమే దిశ కమిటీ సమావేశాలు నిర్వహించారు. 2016 డిసెంబర్ 3న తొలి సమావేశం జరిగింది. ఆ తర్వాత 2017 జూన్ 16న రెండో సమావేశం ఏర్పాటుచేశారు. ఇక చివరి సమావేశం గతేడాది నవంబర్ 26న నిర్వహించారు. జిల్లా ఆవిర్భావం నుంచి నేటి వరకు నిర్ణీత సమయంలో సమావేశం జరిగిన దాఖలాలు ఎప్పుడూ లేవు. కరోనా సమయంలో అసలు సమావేశాలే నిర్వహించక పోగా, ఆ తర్వాత కూడా పలు రకాల కారణాలతో వాయిదా వేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది బీఆర్‌ఎస్ నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో దిశ సమావేశాలపై అంతగా దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమావేశాల జాప్యంపై డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజును 'సాక్షి' వివరణ కోరగా.. సమావేశం నిర్వహణకు సంబంధించిన నివేదికను దిశ కమిటీ అధ్యక్షురాలైన మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితకు పంపించామని, ఎంపీ షెడ్యూల్ మేరకు నిర్వహిస్తామని చెప్పారు.

సమావేశంలో సమీక్షించే పథకాలివే..
దిశ కమిటీ సమావేశంలో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్), దీన్ దయాళ్ అంత్యోదయ యోజన (ఎన్ఆర్ఎల్ఎం), దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్ యోజన (డీడీయూజీకేవై), ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై), జాతీయ సామాజిక భద్రత పథకం (ఎన్ఎస్ఏపీ), ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్ హౌసింగ్ స్కీం), ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన (పీఎంజీఏవై), స్వచ్ఛభారత్ మిషన్, పారిశుద్ధ్యం, ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై), డిజిటల్ ఇండియా భూ రికార్డుల కంప్యూటరీకరణ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన, శ్యాంప్రసాద్ ముఖర్జీ అర్బన్ మిషన్, నేషనల్ హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, నేషనల్ హెల్త్ మిషన్, సర్వ శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ), జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్), మధ్యాహ్న భోజన పథకం, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూ వైఎల్పీజీ), ప్రధాన మంత్రి కౌసల్ వికాస్ యోజన, డిజిటల్ ఇండియా, మౌలిక వసతుల కల్పన (రైల్వే, బీఎస్ఎన్ఎల్, మైనింగ్, బయోగ్యాస్) తదితర పథకాలపై ప్రజాప్రతినిధులు సమీక్ష చేయాల్సి ఉంటుంది.

ఇప్పటివరకు జరిగిన సమావేశ వివరాలిలా..

మొదటిది	2016 డిసెంబర్ 3
రెండోది	2017 జూన్ 16
మూడోది	2018 జూలై 10
నాలుగోది	2018 డిసెంబర్ 4
ఐదోది	2019 ఫిబ్రవరి 1
ఆరోది	2020 నవంబర్ 11
ఏడోది	2022 నవంబర్ 26

క్లుప్తంగా

క్రీడాపోటీల్లో బీసీ గురుకుల విద్యార్థుల సత్తా



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

అశ్వారావుపేటరూరల్: జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో అశ్వారావుపేటలోని బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విజేతలను గురువారం ప్రిన్సిపాల్ కె.మంజుల అభినందించి మాట్లాడారు. గత నెల 21నుంచి 23వ తేదీ వరకు, ఈ నెల 2నుంచి 4వ తేదీ వరకు రెండు విడతల్లో జరిగిన జిల్లా స్థాయి స్పోర్ట్ మీట్‌ల వివిధ విభాగాల్లో అశోక్, చరణ్‌తేజ్, సందీప్, తేజరెడ్డి, కె.రోహిత్, హర్షనాయక్ ప్రతిభ కనబర్చి అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అశోక్, కార్తీక్, చరణ్ తేజ, ధీరజ్, కె.రోహిత్, హర్షనాయక్, తరుణ్, శివం ఎంపిక కాగా, విద్యార్థులతో పాటు పీఈటీ టి.వసంత్‌ను ఆమె అభినందించారు.

బాలికా విద్యకు ప్రాధాన్యం
ఎమ్మెల్యే వనమా



సైకిల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): బాలికా విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు ఆయన సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రవాణా సదుపాయం లేక పాఠశాలలకు తరచూ గైర్హాజరు కావడం వల్ల కొందరు చదువులో వెనుకబడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం బాలికలకు సైకిళ్ల పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. మారుమూల మండలాలైన గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం, పినపాక, చర్ల, దుమ్ముగూడెం, అశ్వారావుపేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం నుంచి పాఠశాలలకు వస్తున్న 200 మంది విద్యార్థినులకు రూ.15 లక్షల విలువైన సైకిళ్లను అందించారు. డీఈఓ వెంకటేశ్వరాచారి, అధికారులు ఎ.నాగరాజశేఖర్, ఎస్‌కె సైదులు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ విచారణ

పినపాక: మండల పరిధిలోని జానంపేట గ్రామపంచాయతీలో జరిగిన అవకతవకలపై గురువారం డీఎల్‌పీఓ పవన్ కుమార్ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పలు దస్త్రాలను రికవరీ చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పంచాయతీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

100 కేజీల గంజాయి సీజ్

పాల్వంచరూరల్: డోజర్ ట్రాక్టర్‌లో తరలిస్తున్న వంద కేజీల గంజాయిని గురువారం పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలో నాగారం కాలనీ సమీపంలో ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. డోజర్ ట్రాక్టర్‌లో ఎండు గంజాయి తరలిస్తుండగా పోలీసులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. ట్రాక్టర్, ఎస్కార్ట్‌గా ఉన్న ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై ఎస్‌ఐ కార్తీక్‌ను వివరణ కోరగా.. గంజాయి పట్టుకున్నది వాస్తవమేనని, విచారణ జరుగుతోందని తెలిపారు. కాగా పట్టుబడ్డ గంజాయి విలువ రూ.25 లక్షలు ఉంటుందని అంచనా.

విద్యార్థిని అదృశ్యం

ఇల్లెందు: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన 16 ఏళ్ల విద్యార్థిని అదృశ్యంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. సుభాష్‌నగర్‌కు చెందిన ఆమె పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. బుధవారం ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. విద్యార్థిని తండ్రి ముత్తయ్య ఫిర్యాదు మేరకు సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బూర్గంపాడు: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో బుధవారం రాత్రి ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ లభించిన నగదును సీజ్ చేసి, వారిని కోర్టుకు తరలించినట్లు ఎస్సై నాగబిక్షం తెలిపారు.

విద్యుత్ మోటార్ చోరీ

బూర్గంపాడు: బూర్గంపాడు సమీపంలోని దోమలవాగు వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ విద్యుత్ మోటార్‌ను బుధవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. పెద్దమోరీ వద్ద వ్యవసాయ విద్యుత్ మో టార్‌ను పగులగొట్టి కాపర్ వైర్‌ను అపహరించారు. ఈ ఘటనపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

‘పోలీస్’ ఫలితాల్లో ప్రతిభ

- కానిస్టేబుళ్లుగా ఎంపికైన పలువురు యువతీ యువకులు
- విజేతలకు అధికారులు, ప్రజాప్రతినిధుల అభినందనలు

చండ్రుగొండ/జూలూరుపాడు: రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ తుది ఫలితాల్లో పలువురు సత్తాచాటారు. చండ్రుగొండ మండలం గానుగపాడు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. బెజవాడ కోటేశ్వరరావు, అన్నదమ్ములు ఉగ్గం వేణు, ఉగ్గం సతీష్ ఉద్యోగాలు సాధించారు. ఒకే ఇంట్లో ఇద్దరు ఉద్యోగాలు పొందడంతో ఆ కుటుంబం హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జూలూరుపాడు మండలం అన్నారుపాడు గ్రామానికి చెందిన గుగులోత్ భావ్‌సింగ్, పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాకు చెందిన బానోత్ సంతోష్, సురారం గ్రామానికి చెందిన ఇస్లావత్ వీరభద్రం, వెంగన్నపాలేనికి చెందిన తిరువేధుల కార్తీక్, రాజారావుపేట గ్రామానికి చెందిన దొప్ప జగదీష్ బాబు, పాపకొల్లుకు చెందిన కుమ్మరికుంట్ల ప్రశాంత్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

బూర్గంపాడులో ఏడుగురు..

బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పోలీస్ కానిస్టేబుళ్ల ఫలితాల్లో బూర్గంపాడు మండలానికి చెందిన ఏడుగురు వ్యక్తులు ఎంపికయ్యారు. మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన మారుడి వెంకటేశ్వరరెడ్డి, పేరం వెంకట్రామిరెడ్డి, బూర్గంపాడుకు చెందిన బర్ల రఘు, అనూప్, పుట్టి నర్సింహారావు, అంజనాపురం గ్రామానికి చెందిన భూక్యా వినోద్, కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిని ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. పోలవరం గ్రామానికి చెందిన మెండి శ్వేత కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించగా, గ్రామస్తులు గురువారం అభినందించారు.

కరకగూడెంలో..

కరకగూడెం: మండలంలోని కొర్నవల్లి గ్రామానికి చెందిన మాటూరి రాజు, మాటూరి కోటేశ్వరరావు, అనంతారం గ్రామానికి చెందిన అత్తె సాయి కుమార్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కాగా రాజు, కోటేశ్వరరావు రేగా విష్ణు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు.



బూర్గంపాడు: ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన శ్వేతను అభినందిస్తున్న గ్రామస్తులు

హమాలీ కుమార్తె..

దమ్మపేట: మండల కేంద్రానికి చెందిన హమాలీ కుమార్తె భోగి సమ్మక్క సివిల్ కానిస్టేబుల్‌గా విజయం సాధించింది. ఆమె తండ్రి సత్యం గిరిజన సహకార సంస్థలో హమాలీగా పనిచేస్తుండగా, తల్లి రమణ అంగన్వాడీలో హెల్పర్‌గా పనిచేస్తోంది. కూతురు ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమ్మక్కను ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందించారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: టేకులపల్లి మండలానికి చెందిన జర్పుల విద్యావతి, గంగాధర సంధ్య,భూక్య రాజేశ్వరి, వసంతరావు, రవివర్మ, రాజేష్, కృష్ణ, వరప్రసాద్, ఇస్లావత్ ప్రేమ్‌కుమార్, బోడ సందీప్, ఆంగోతు వినోద్ కుమార్, భూక్య రాంబాబు, కుంజా నాగరాజు తదితరలు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని ఆయా గ్రామాలు అభినందించారు.

సుజాత నగర్‌లో..

సుజాతనగర్: మండలంలోని మాలబంజర గ్రామానికి చెందిన గుగ్లోత్ హరీష్, సర్వారానికి చెందిన మాలోత్ కళ్యాణ్, సుజాతనగర్‌కు చెందిన ఎస్‌కే సలీంపాషా, రాంజీతండాకు చెందిన గుగులోత్ సుధాకర్, బోడా ప్రేమ్‌కుమార్, నరసింహసాగర్‌కు చెందిన మిర్యాల అశోక్, నాయకులగూడెం గ్రామానికి చెందిన పాలకిట్టి సురేష్ వివిధ విభాగాల్లో కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

మూడోసారి కానిస్టేబుల్‌గా ఎంపిక..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన చిన్నూరి రామకృష్ణ మూడోసారి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తొలుత 2018లో టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికై అశ్వాపురం, మణుగూరు, పాల్వంచ పోలీస్‌స్టేషన్లలో పనిచేశాడు. ఉద్యోగం చేస్తూనే 2020లో స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్)కు ఎంపికై ప్రస్తుతం భద్రాచలంలో రామాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. రామకృష్ణను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

విద్యార్థులకు అల్పాహారం..

- నేటి నుంచి జిల్లాలోని ఐదు స్కూళ్లలో అమలు
- దసరా సెలవుల అనంతరం అన్ని పాఠశాలల్లో..
- విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలపై ప్రభుత్వం దృష్టి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. ఇప్పటికే మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ మెరుగుపర్చారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో రాగా జావను ప్రవేశపెట్టి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నేటి నుంచి ప్రభుత్వం ముఖ్యమంత్రి అల్పాహార పథకం అమలుకు శ్రీకారం చుడుతోంది. విద్యార్థులకు ఉదయం వేళ టిఫిన్ అందించనున్నారు. ఇందుకోసం పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఐదు పాఠశాలలను ఎంపిక చేసి పథకం ప్రారంభించనున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఐదు పాఠశాలల్లో, అనంతరం దసరా సెలవుల తర్వాత జిల్లాలోని 1,600 పాఠశాలల్లో ఈ పథకం ప్రారంభిస్తామని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు.

పథకం అమలు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది. వారంలో ఆరు రోజులపాటు వివిధ రకాల టిఫిన్‌ను విద్యార్థులకు అందించనున్నారు. సోమవారం ఇడ్లీ సాంబారు లేదా గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ, మంగళవారం పూరి, ఆలు కుర్మా లేదా టొమాటో బాత్, సాంబారు, బుధవారం ఉప్మా, సాంబారు, బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ, గురువారం చిరుధాన్యాల ఇడ్లీ, సాంబారు లేదా పొంగల్ సాంబారు, శుక్రవారం ఉగ్గాని, అటుకులు, చిరుధాన్యాల ఇడ్లీ, చట్నీ లేదా బియ్యం రవ్వ కిచిడి చట్నీ, శనివారం పొంగల్ సాంబారు లేదా కూరగాయల పలావ్ పెరుగు చట్నీ, ఆలు కుర్మా పాఠశాలల్లో తయారు చేసి వడ్డిస్తారు. పిల్లల్లో పోషకాహార లోపం అధిగమించడం, తరగతి గదిలో విద్యార్థులు ఆకలితో ఉండకుండా నివారించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు, విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు ఈ పథకం దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. పథకం అమలు తీరును ఉపాధ్యాయులు, జిల్లా విద్యాధికారులు మొబైల్ యాప్ ద్వారా పర్యవేక్షణ చేయనున్నారు. పాఠశాల సమయానికి 45 నిమిషాల ముందు అల్పాహారం అందించనుండగా, విద్యార్థులు గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం పాఠశాలలకు ముందే రావాల్సి ఉంటుంది. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అల్పాహారం అందించనుండగా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఏర్పాట్లు పూర్తి



ముఖ్యమంత్రి అల్పాహార పథకం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతంతో పాటుగా అడ్మిషన్లు కూడా పెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఈ పథకం తెచ్చింది.

–ఎం.జ్యోతిరాణి, ఇందిరానగర్ స్కూల్ హెచ్ఎం, లక్ష్మీదేవిపల్లి

ఎంతో మేలు



ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి అమలు జరుగుతుంది. దసరా సెలవుల అనంతరం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అమలు చేస్తాం. విద్యార్థులకు రాగిజావ, మిడ్డేమీల్స్‌తో పాటు అల్పాహారం అందించనుండటంతో ఎంతో మేలు జరుగుతుంది.

–వెంకటేశ్వరాచారి, డీఈఓ

‘గౌతమీస్ఫూర్తి’ సేవలు అభినందనీయం



విద్యార్థులతో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సులోచనారాణి, ప్రిన్సిపాల్ సత్యప్రకాష్

అశ్వాపురం: నిరుపేద విద్యార్థుల చదువుకు సహాయ సహకారాలు అందిస్తున్న గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సులోచనారాణి అన్నారు. అశ్వాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 26మందికి భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం రూ.5వేల చొప్పున రూ.1.30లక్షలు అందజేశారు. ఈకార్యక్రమంలో సులోచనారాణి మాట్లాడుతూ కళాశాలలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు 2021లో రూ.95 వేలు, 2022లో రూ.లక్ష, ఇప్పుడు రూ.1.30 లక్షలు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పట్టుదలతో దాతల చేయూతతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రకాష్, అధ్యాపకులు, ఫౌండేషన్ సభ్యుడు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుపై దాడి

దమ్మపేట: భూవివాదం కారణంగా కౌలు రైతుపై దాడికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని లచ్చాపురం గ్రామంలో చోటు చేసుకోగా ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని లచ్చాపురం గ్రామానికి చెందిన అల్లం బుచ్చిరాజు, ఏపీ, ఏలూరు జిల్లా టీ.నర్సాపురం గ్రామానికి చెందిన దాబా రాములు నుంచి వ్యవసాయ భూమిని కౌలుగా తీసుకున్నాడు. అందులో యూకలిప్టస్ మొక్కలను సాగు చేస్తున్నాడు. ఈ భూమి విషయంలో దాబా రాములు, యాట్ల సీతారాములుకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నెల 2న బుచ్చిరాజు వ్యవసాయ పనులను ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో యాట్ల సీతారాములు అతని కళ్లలో మిరియాల పొడి చల్లి, అసభ్య పదజాలంతో దూషించాడు. భౌతిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

కరెంటు బిల్లు కోసం దాడి

ఇల్లెందు: ఇల్లు ఖాళీ చేసే క్రమంలో కరెంటు బిల్లు కట్టాలని అడ్డుకుని దాడి చేసిన సంఘటనపై కేసు నమోదైంది. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన బి.శరణ్య అదే ఏరియాకు చెందిన వాసం సుజాత ఇంట్లో కొంతకాలం అద్దెకు ఉంది. గత నెల 29న ఇల్లు ఖాళీ చేసింది. ఈ క్రమంలో కరెంటు బిల్లు కట్టాలని ఓనర్ అడ్డుకుంది. బిల్లు వచ్చిన తర్వాత చెల్లిస్తామని తెలిపినా ఓనర్ సుజాత పెడచెవిన పెడుతూ అడ్డుకుని ఘర్షణ పడి కర్రతో కొట్టింది. దీంతో శరణ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు సుజాతతో పాటు ఆమె కుటుంబ సభ్యుల మీద కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

మృతురాలు మూడు నెలల గర్భవతి

అశ్వారావుపేటరూరల్: కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అశ్వారావుపేటలో గురువారం చోటు చేసుకుంది. మృతురాలు మూడు నెలల గర్భవతి. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక మద్దిరావమ్మ గుడి సెంటర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఎర్రం కృష్ణ(24), దమ్మపేట మండలం నెమలిపేట గ్రామానికి చెందిన ఎర్రం రమ్య(23) మూడేళ్ల క్రితం ప్రేమించి, కులాంతర వివాహం చేసుకున్నారు. కృష్ణ తాపీ పని చేస్తుండగా రమ్య కూలీ పనులకు వెళుతోంది. వీరి మధ్య గత మూడు నెలలుగా మనస్పర్థలు నెలకొనగా, రెండు నెలల క్రితం పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టి కౌన్సిలింగ్ చేశారు. తాజాగా మళ్లీ కలహాలతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో దంపతులిద్దరూ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా, అదే గ్రామంలో మరో ఇంట్లో ఉంటున్న కృష్ణ తల్లి నాగమ్మ కొడుకుకు ఫోన్ చేస్తే కలవకపోవడంతో వెంటనే అతడి ఇంటికి చేరుకుంది. పిలిచినా తలుపు తీయకపోవడంతో పొరుగు వారి సహాయంతో తలుపులు పగులకొట్టి చూసేసరికి ఇద్దరూ మృతి చెంది ఉన్నారు. పోలీసులకు సమాచారం అందించగా సీఐ కరుణాకర్, అదనపు ఎస్సై శివరామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్ట్ మార్టమ్ నిర్వహించారు. మృతురాలి తండ్రి కుడివి గంగులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడిన రమ్య, కృష్ణ (ఫైల్)

మృతురాలు గర్భవతి..

ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు గురువారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారని పొరుగువారు చెబుతున్నారు. ఆస్పత్రిలో రమ్య పరీక్ష చేయించుకోగా మూడు నెలల గర్భవతి అని చెప్పడంతో మందులు తీసుకొని, ఆ తర్వాత బస్టాండ్ సెంటర్లో కూరగాయాలు కుడా కొన్నారు. మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న కాసేపటికే ఇద్దరి మధ్య గొడవ జరిగిందని, దీంతో కృష్ణ రమ్య తండ్రికి ఫోన్ చేసి ‘మీ కూతురును మీ ఇంటికి తీసుకెళ్లండి’ అని చెప్పాడని మృతురాలి బంధువులు తెలిపారు.

ఓసీ నిర్వాసితులుగా గుర్తించాలి

- లేకపోతే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తాం
- జేకే ఓసీ ప్రభావిత ప్రాంత 21 ఏరియా ప్రజల వెల్లడి

ఇల్లెందురూరల్: సింగరేణి చేపట్టబోయే జేకే ఓసీ నిర్వాసితులుగా తమను కూడా గుర్తించాలని ఓసీ ప్రభావిత ప్రాంత 21 ఏరియా ప్రజలు డిమాండ్ చేశారు. తమ ఆకాంక్షను విస్మరిస్తే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. మండలంలోని 21 ఏరియాలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిలక్‌నగర్ సర్పంచ్ ధనసరి స్రవంతి, ప్రభావిత ప్రాంత ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ ఓసీ ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభించిన నాటి నుంచి 21ఏరియా నివాస ప్రాంతాల పరిస్థితిని పలు రూపాల్లో సింగరేణి ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ దృష్టికి తీసుకెళ్లామని, ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. తమను ఎవరూ పట్టించుకోలేదని కంటతడి పెట్టుకున్నారు. పబ్లిక్ హియరింగ్‌ను మమ అనిపించిన అధికారులు తమకు అనుకూలంగా సర్వే ప్రక్రియ పూర్తి చేశారని ఆరోపించారు. ఓసీ పేరుతో అనేక ఏళ్లుగా అదనపు నిర్మాణాలు, ఇళ్లకు మరమ్మతులు చేయనీయకుండా సింగరేణి అధికారులు అడ్డుకున్నారని, దీంతో ఇరుకు గదుల్లోనే జీవించామని వాపోయారు. తమ సమస్యను అధికారులు, రాజకీయ పక్షాలు పట్టించుకోకపోవడంతో ఎన్నికల బహిష్కరణకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఓసీని అడ్డుకునేలా తమ భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చందావత్ రమేష్‌బాబు, సారంగపాణి, ధనసరి రాజు, శివ, విజయ్, మహేష్, శ్రీను, సుధాకర్, రత్నాకర్, రాజు, రమేష్, వంశీ, రఘు, అశోక్, అనిల్, రవి, హుస్సేన్, వసంత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న జేకే ఓసీ ప్రభావిత ప్రాంత ప్రజలు

ముద్దాయికి నాలుగేళ్ల జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: బాలికపై అత్యాచారయత్నం కేసులో దుమ్ముగూడెం లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన బొందల వెంకటరమణకు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి శ్యాంశ్రీ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా.. దుమ్ముగూడెం మండలం లక్ష్మీపురానికి చెందిన 12 ఏళ్ల బాలికపై 27.7.2022న అదే గ్రామానికి చెందిన బొందల వెంకటరమణ అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అదే రోజు బాలిక తల్లిదండ్రులు దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. 12 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకటరమణకు నాలుగేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ రావి విజయ్‌కుమార్, పీపీడీ లక్ష్మి వాదించగా, కోర్టు లైజన్ హెచ్‌సీ హరిగోపాల్, పీసీ నవీన్ సహకరించారు.

దాడి ఘటనలో కేసు నమోదు

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలోకి అక్రమంగా ప్రవేశించడంతోపాటు మహిళలపై భౌతిక దాడికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని గున్నేపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన పాగి తిరుపతమ్మకు గున్నేపల్లి గ్రామంలో 5 ఎకరాల 20 కుంటల వ్యవసాయ భూమి వారసత్వంగా వచ్చింది. ఆ భూమిలో ఈ నెల 4న గంటా లచ్చారావు, గంటా హైమావతిలతో పాటు మరో ఎనిమిది మంది అక్రమంగా ప్రవేశించారు. ప్రశ్నించిన భూ యజమాని తిరుపతమ్మ, ఆమె సోదరి గంటా చుక్కమ్మలపై కర్రలతో దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

డీజిల్ దొంగలపై కేసు...

కరకగూడెం: డీజిల్ దొంగలపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కరకగూడెం ఎస్సై రాజారాం కథనం ప్రకారం.. అనంతారం గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో ఈ నెల 4న అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాల ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా : 11 మందికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన చిన్నారికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

ఇల్లెందురూరల్: మండలంలోని రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ నారాయణపురం స్టేజీ సమీపంలో గురువారం ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో 11 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో జోగ భవాని, వీరభద్రమ్మ, మూతి రాజు, ఏడు నెలల బాలుడు అక్షిత్‌లకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన భవాని, మూతి రాజు, వీరభద్రమ్మలను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తీసుకెళ్లారు. సుభద్ర, కృష్ణవేణి, సుజాత, కావ్య, కౌషిక్, శ్రీదేవిలకు స్వల్పంగా గాయాలయ్యాయి. కాగా డ్రైవర్ మద్యం తాగి ఆటో నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

పాముకాటుతో బాలుడు మృతి

పినపాక: పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వలస ఆదివాసి విప్పలగుంపు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జబ్బా అన్వేష్(8) ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో పాముకాటు వేసింది. బాలుడు ఏడవడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు మణుగూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బాలుడు మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

మణుగూరు టౌన్: పినపాక మండలానికి చెందిన కాలేవారు సాయి కుమార్ (26) పురుగుల మందు తాగి ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా మృతుడి చేతిపై ‘నా చావు కారణం డాక్టర్ మౌనిక’ అని రాసి ఉంది. దీంతో తన కుమారుడి ఆత్మహత్యకు ఆమే కారణమని అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి తల్లి హైమావతి మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితపై బ్లేడ్‌తో దాడి

ప్రేమించాలంటూ యువకుడి వేధింపులు

పాల్వంచరూరల్: వివాహితను ప్రేమించమంటూ ఓ యువకుడు బ్లేడ్‌తో దాడిచేసి గాయపరిచిన సంఘటన కిన్నెరసానిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కిన్నెరసాని గ్రామానికి చెందిన నజియా భర్తతో విడిపోయి కొంతకాలంగా తల్లిగారి ఇంటివద్ద ఉంటోంది. పాల్వంచ పట్టణంలోని ఓ దుకాణంలో పని చేస్తూ తన పిల్లలను చదివించుకుంటోంది. రోజులాగే గురువారం కూడా పిల్లలను స్కూల్‌కు పంపించి తాను షాపునకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా అదే గ్రామానికి చెందిన జులాయిగా తిరిగే సీహెచ్.శివ ఇంట్లోకి చొరబడి తనను ప్రేమించాలంటూ బెదిరించాడు. ఆమె నిరాకరించడంతో బ్లేడ్‌తో దాడి చేశాడు. నజియా కేకలు వేయడంతో ఆమె తల్లి గౌసియా వచ్చి ప్రతిఘటించడంతో శివ అక్కడి నుంచి పారిపోయాడు. చేతికి గాయాలు కావడంతో నజియాను పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శివను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర © 96590 57777. [M-10419]

Wanted
■ HI REACH BROAD BAND నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అడ్రస్ : JL టవర్స్, వైరా రోడ్, ఖమ్మం. సంప్ర. : 96422 25357, 96422 25493. [M-1221277]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221733]

■ కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు, ప్రముఖుల ఇళ్ళ వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కావలెను. Sal: 14-20K వసతి + భోజనం, విజయవాడ © 91608 35559, 78158 35561 [B-386]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీతం: 18K. Ph: 9640400073/ 9848571888 [HA-189337]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 7207776136 [G-801132]

■ జాబ్ గ్యారెంటీ మహిళలకు మా కంపెనీలో ఉచిత రూం+భోజనం ఇచ్చి జాబ్ ఇవ్వబడును. జీతం: 20,000/- వరకు ఏజెంట్స్ (1 మనిషికి: 5000/- కమీషన్) Ph: 8886733005/ 008 [H-793357]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీసెస్ (AP NO-1) VJA, HYD శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు వంట/ ఇంటి పని, బేబీ కేర్ వర్కర్స్ కావలెను భోజనం+వసతి+జీ :15-21 వేలు ఏజెంట్లకు 5 వేలు కమీషన్ © 86397 56217, 86397 56214 [B-1068139]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957
9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

మణుగూరు రూరల్: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో ఉద్యోగులు ఇప్పిస్తామని కొందరు దళారులు డబ్బు వసూలు చేస్తున్నారని తెలిసిందని, నిరుద్యోగ యువత వారి నమ్మి మోసపోవద్దని ప్లాంట్ సీఈ బి.బిచ్చన్న సూచించారు. మణుగూరులో గురువారం ఆయన మాట్లాడుతూ బీటీపీఎస్‌లో పర్మినెంట్ ఉద్యోగాల భర్తీకి విద్యుత్ సౌధ నుంచి మాత్రమే నోటిఫికేషన్ వస్తుందని తెలిపారు. అలాకాకుండా ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే వారి మాటలు నమ్మి డబ్బు నష్టపోవద్దని పేర్కొన్నారు.

డీఎంఎల్‌టీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ ?

కొత్తగూడెంరూరల్ : కొత్తగూడెం మెడికల్ కళాశాలలో గురువారం డీఎంఎల్‌టీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 756 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు కళాశాలలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారామెడికల్ బోర్డు ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశారు. కాగా, పరీక్షకు హాజరైన అభ్యర్థుల నుంచి కళాశాల సిబ్బంది రూ. 6 వేల వరకు వసూలు చేశారని, జోరుగా మాస్ కాపీయింగ్ జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది నాలుగో తరగతి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇన్విజిలేటర్లుగా నియమించడంతో రెగ్యులర్ ఉద్యోగులు 15 మంది ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. తాము ఉండగా, నాలుగో తరగతి ఉద్యోగులను ఎందుకు ఇన్విజిలేటర్లుగా నియమించారని ప్రశ్నించారు. దీంతో ప్రిన్సిపాల్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా ఈ ఘటన పలు అనుమానాలకు దారి తీస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావును వివరణ కోరగా ఎలాంటి మాస్ కాపీయింగ్ జరుగలేదని, పరీక్షలు పటిష్టంగా నిర్వహించామని తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన టపాసులు స్వాధీనం

కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.1,82,350 విలువైన టపాసులను కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెంలోని రామా టాకీస్ ఏరియాలో అక్రమంగా టపాసులను నిల్వ చేశారనే సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ గని, సురేష్, వీరన్న తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎం.రమణ, లలిత్‌కుమార్ నిల్వ ఉంచిన రూ.1,82,350 విలువైన టపాసులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. కాగా, దీపావళి సమీపిస్తున్న వేళ జిల్లా కేంద్రానికి చెందిన పలువురు వ్యాపారులు భారీ స్థాయిలో టపాసులు తెప్పించి నిల్వ చేశారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశమున్నందున పోలీసులు స్పందించి తనిఖీలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొనుగోలు చేస్తున్నట్లు నటించి బంగారం చోరీ

- భూపాలపల్లిలో పట్టుబడిన ఖమ్మం జిల్లావాసులు
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి డీఎస్పీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాములు

భూపాలపల్లి అర్బన్ : జ్యూయెలరీ షాపులో ఆభరణాలు కొనుగోలు చేస్తున్నట్లు నటించి.. బంగారం చోరీ చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు భూపాలపల్లి డీఎస్పీ రాములు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బొజ్జగాని దీనమ్మ, బొజ్జగాని నాగేంద్రమ్మ, మామిడి సాయిచరణ్.. రెండు నెలల క్రితం భూపాలపల్లిలోని సాయిమౌనిక జ్యూయెలరీ షాపునకు వచ్చారు. ఈక్రమంలో ఆభరణాలను కొనుగోలు చేస్తామని చెప్పి పరిశీలిస్తూ బంగారం చోరీ చేశారు. అనంతరం ఈనెల 4వ తేదీన మళ్లీ షాపులోకి వచ్చి చోరీకి యత్నించగా యజమాని నవీన్‌కుమార్ గమనించి పట్టుకునే క్రమంలో తప్పించుకున్నారు. దీంతో షాపు యజమాని సీసీ ఫుటేజీ ఆధారంగా ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో గురువారం ఉదయం భూపాలపల్లి సమీపాన కమలాపూర్ క్రాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించడంతో జ్యూయెలరీ షాపులో చోరీ చేసింది తామేనని ఒప్పుకున్నారు. చోరీ అనంతరం కాళేశ్వరం వెళ్లి వస్తుండగా అస్నూ పోలీసులకు పట్టుబడిన వీరి నుంచి కారు, రూ.4వేల నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు. ఈసమావేశంలో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ గ్రామం.. పోలీసువరం!



మల్లవరం గ్రామకూడలి

- మల్లవరం నుంచి కానిస్టేబుళ్లుగా 13మంది..
- కన్నవారి కలలు నిజం చేసిన యువత
- పట్టుబట్టి కొలువు కొట్టడంపై హర్షాతిరేకాలు

తల్లాడ: పిల్లలు పాఠశాలకు వెళ్తున్నప్పుడు తల్లిదండ్రులు వారిపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. శ్రద్ధగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షిస్తారు. ఈ విషయాన్ని గ్రహించిన పిల్లలు అంతే ఆసక్తితో చదువుకుని కొలువుల్లో స్థిరపడారు. తల్లాడ మండలం మల్లవరానికి చెందిన యువత ఇదే కోవలోకి వస్తారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగి చదువుకుని వీరు మట్టిలో మాణిక్యాలుగా నిలిచారు. ప్రభుత్వం కానిస్టేబుళ్ల ఎంపిక ఫలితాలను వెల్లడించగా ఈ గ్రామం నుంచి ఏకంగా 13 మంది ఎంపిక కావడం విశేషం. వీరందరూ పేద, మధ్యతరగతి వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారే కావడం మరో విశేషం.

17ఏళ్ల క్రితం నలుగురు...

మల్లవరం గ్రామానికి చెందిన నలుగురు 17ఏళ్ల క్రితం కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిని స్ఫూర్తిగా తీసుకున్న యువకులు పలువురు కానిస్టేబుళ్ల ఉద్యోగ సాధనలో నిమగ్నమయ్యారు. క్రీడలపై శ్రద్ధ కనబరుస్తూ పట్టుదలతో కోచింగ్ తీసుకున్న పలువురు ఎంపికవుతుండడంతో ఉద్యోగాల సాధనలో ఈ గ్రామం జిల్లాలోనే ముందంజలో నిలుస్తోంది. ఈనేపథ్యాన 2017 ఫిబ్రవరిలో వెల్లడైన ఫలితాల్లో ఒకేసారి 17మంది కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. అలాగే, 2019 సెప్టెంబర్‌లో మళ్లీ 17 మంది ఎంపికై రికార్డు సృష్టించారు. తిరిగి తాజాగా వెలువడిన ఫలితాల్లో 13 మంది వివిధ విభాగాల్లో కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడంతో గ్రామం పేరు మార్మోగుతోంది. ఎక్సైజ్, సివిల్, ఏఆర్, టీఎస్ఎస్పీ, టీఎస్ఎస్ఎఫ్ విభాగాల్లో కటికి ఉపేందర్, జవ్వాది హరీశ్, కుంచం సైదులు, చాపల శ్రీకాంత్, తుటారి తిరుపతరావు, కటికి ప్రవళిక, చాపల రవీందర్, దుగ్గిదేవర వంశీ, చాపల పవన్, ఎర్రి లక్ష్మణ్‌రావు, మేడి శ్రీహరి, మేడి వరుణ్, కోలేటి రాంమోహన్ తాజాగా ఎంపికయ్యారు.

గ్రామంలో 50 మంది పోలీసులే..

మల్లవరంలో తాజాగా ఎంపికైన వారితో 50 మందికి పైగా పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు. గతంలో పోలీస్ ఉద్యోగం సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని, వారి సలహాలు తీసుకుంటూ పలువురు లక్ష్యాన్ని చేరుకుంటున్నారు. గ్రామ యువత తీరిక సమయాల్లో వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుకుంటున్నారు. యువతకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఉండడంతో మల్లవరం పేరు కాస్త పోలీసువరంగా మారుతోంది!

తొలి ప్రయత్నంలోనే సాధించా..



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ పట్టుదలతో చదివాను. తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో సాధించిన ఉద్యోగంలో అంకితభావంతో పనిచేసి గ్రామానికి పేరు తీసుకొస్తా.

– కటికి ప్రవళిక, మల్లవరం

తల్లిదండ్రుల కలలు సాకారం చేశా..



పేద కుటుంబంలో పుట్టిన నన్ను ఉద్యోగిగా చూడాలని తల్లిదండ్రులు అనుకున్నారు. వారి ఆశలకనుగుణంగా కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. గ్రామంలో పలువురు కానిస్టేబుళ్లుగా ఎంపికవుతుండటంతో వారిని స్ఫూర్తిగా తీసుకుని పట్టుదలతో చదవడంతో ఉద్యోగం సాధించగలిగా.

– మేడి శ్రీహరి, మల్లవరం

ముష్టికుంట్ల నుంచి నలుగురు...

బోనకల్: కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని ముష్టికుంట్లకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన షేక్ అజారుద్దీన్, బందం దుర్గాప్రసాద్, వడిదల గోపి, వర్దన్ కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడం విశేషం. అలాగే, రావినూతలకు చెందిన తాళ్లూరి ఎర్రబ్బాయి హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూనే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబాలకు చెందిన అభ్యర్థులు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించడంపై స్థానికులు అభినందించారు.



షేక్ అజారుద్దీన్



బందం దుర్గాప్రసాద్



తాళ్లూరి ఎర్రబ్బాయి

గార్లలో అసమ్మతి వర్గం సమావేశం



గార్లలో సమావేశమైన అసమ్మతి వర్గం నేతలు

గార్ల/ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియకు వ్యతిరేకంగా రాజుకున్న అసమ్మతి వర్గం నేతల సమావేశంలో గురువారం రాత్రి గార్లలో జరిగింది. ముఖ్య నేతలంతా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఎమ్మెల్యే హరిప్రియ దంపతులు అనుసరిస్తున్న వ్యవహారశైలికి సక్రమంగా లేదని, పార్టీని పూర్తిగా విచ్ఛిన్నం చేసి వ్యక్తి, వ్యవస్థకు పునాది వేశారని, అందుకే వారిపై ప్రజలకు నమ్మకం పోయిందని సమావేశంలో పాల్గొన్న నేతలు అభిప్రాయపడ్డారు. ఆత్మ గౌరవం కోసమే తాము పోరాడుతున్నామని, ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకుని వెళ్లి మార్పు జరిగే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. పలువురు బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తామని, ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చితే గెలుపు కోసం పాటుపడుతామని తీర్మానించారు. ఇటీవల ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర పలు దఫాలు ఇల్లెందులో కొంతమంది నేతలతో సమావేశమై అసమ్మతిని చల్లార్చే ప్రయత్నం చేశారు. అయితే తమ వర్గం నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వారు రవిచంద్రకు వివరించారు. ఈ నేపథ్యంలో గార్లలో సమావేశమై చర్చించడం గమనార్హం. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ నాగరత్నమ్మ, మూల మధుకర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, రామ్మూర్తి, యుగంధర్, భావ్‌సింగ్, దేవీలాల్‌నాయక్, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

బదిలీలతో పాటు పదోన్నతులూ కల్పించాలి



టీపీటీఎఫ్ ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలతో పాటు పదోన్నతులు కూడా ఇవ్వాలని టీపీటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. ఈమేరకు టీపీటీఎఫ్ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో గురువారం ప్రదర్శన నిర్వహించాక నిరసన తెలిపారు. ఈఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యంతర భృతి కనీసం 15శాతానికి పెంచాలని, జోన్–2 హెచ్‌ఎం, జోన్–1, 2ల్లో పండిట్, పీఈటీలకు పదోన్నతులతో పాటు బదిలీలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, బదిలీ అయిన ఎస్ఏలు, పీడీల జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రిక్కాబజార్ పాఠశాల నుంచి ధర్నాచౌక్ వరకు ప్రదర్శన సాగగా నాయకులు పీవీఆర్‌కే.ప్రసాదరావు, ఆర్.రవికుమార్, వెంకటేశ్వరరావు, మల్లయ్య, నాగేశ్వరరావు, ఉమాదేవి, వెంగళరావు, భావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యాన...

పదోన్నతులతో పాటు బదిలీలు తక్షణమే చేపట్టాలని పీఆర్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోతుకూరి మధు, రామిశెట్టి రంగారావు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలో ప్రదర్శన నిర్వహించాక ధర్నాచౌక్‌లో వారు మాట్లాడుతూ కొందరు అధికారులు ఏకపక్ష వైఖరితో పదోన్నతులు లేకుండా బదిలీల షెడ్యూల్ జారీ చేశారని ఆరోపించారు. అలాగే, మధ్యంతర భృతి ఐదు శాతమే ప్రకటించడం సరికాదని, దీన్ని 15శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం బాధ్యులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.బ్రహ్మారెడ్డి, విజయ, అమృతకుమార్, కట్టా శేఖర్, హరిత, హుస్సేన్, ఝాన్సీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న పీఆర్‌టీయూ బాధ్యులు

మావోయిస్టుల అదుపులో జవాన్

- వారం రోజుల క్రితం కిడ్నాప్
- తాజాగా లేఖ విడుదల చేసిన మావోలు



జవాన్ శంకర్ కుడియం

చర్ల: మావోయిస్టులు గత నెల 29న తీసుకెళ్లిన బస్తర్ బెటాలియన్ జవాన్ శంకర్ కుడియం వారం రోజులుగా వారి అదుపులోనే ఉన్నాడు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తున్న సందర్భంగా ఎర్మనార్ సమీపాన ఆయనను కిడ్నాప్ చేసిన మావోయిస్టులు వారం రోజులుగా వారి వద్దే ఉంచుకోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆయనకు హానీ తలపెట్టకుండా మానవతా దృక్పథంతో విడుదల చేయాలని జవాన్ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మా అదుపులోనే ఉన్నాడు...

చర్ల: బీజాపూర్ జిల్లా బస్తర్ బెటాలియన్‌కు చెందిన జవాన్ శంకర్ కుడియం తమ పీఎల్‌జీఏ అదుపులోనే ఉన్నాడని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. బీజాపూర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్‌లో ఉంటూ బస్తర్ బెటాలియన్‌లో జవాన్‌గా పనిచేస్తున్న శంకర్ గత నెల 29న జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తున్న సందర్భంగా మావోలు ఆయనను కిడ్నాప్ చేశారు. వారంరోజులుగా ఆయన జాడ తెలియకపోవడంతో ఇటు కుటుంబీకులు, అటు పోలీసు యంత్రాంగంలో ఆందోళన చెందుతున్న నేపథ్యాన మావోయిస్టు పార్టీ మాడ్ డివిజనల్ కమిటీ కార్యదర్శి అనితా మాండవి ఒక లేఖ విడుదల చేశారు. గతనెల 29న శంకర్‌ను బీజాపూర్ జిల్లాలోని ఎర్మనార్ వద్ద పట్టుకున్నామని, ఆయనను తమ పార్టీ విచారిస్తోందని తెలిపారు. కాగా, తాము జవాన్‌ను అదుపులోకి తీసుకున్న విషయం పోలీసు అధికారులకు తెలిసినా బయటపెట్టకపోవడంతో పోలీసులు ఏమి కోరుకుంటున్నారో, దేనికోసం ఎదురుచూసున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. జవాన్ కిడ్నాప్‌పై పోలీసుల స్పందన ఎలా ఉంటుందనే అంశం ఆధారంగా తమ నిర్ణయం ఉంటుందని అనిత ఆ లేఖలో తెలిపారు. సెప్టెంబర్ 4న తాడిమెట్లలో ఇద్దరు అమాయక గిరిజనులను పట్టుకుని ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారని, ఇలా బస్తర్‌లో పోలీసులు చేస్తున్న హత్యలపై ప్రతీ ఒక్కరూ నిరసన తెలపాలని కోరారు. తాడిమెట్ల హత్యకు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

కారేపల్లి: అల్లరి చేస్తుండడమే కాక హోంవర్కు సరిగ్గా చేయడం లేదని ఓ ఉపాధ్యాయుడు విద్యార్థిని చికతబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన మాలోతు దేవ్‌సింగ్ కుమారుడు జయరామ్ స్థానిక నిర్మలా హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం తరగతి గదిలో జయరామ్ అల్లరి చేస్తున్నాడని, హోమ్‌వర్క్ సరిగ్గా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కర్రతో విద్యార్థి వెనుక భాగంలో కొట్టగా పిరుదులపై వాతలు పడ్డాయి. అయితే, జయరామ్ విషయాన్ని ఇంట్లో చెప్పకుండా స్నానం తానే చేస్తానంటూ ఎవరినీ దగ్గరకు రానివ్వకపోవడంతో తండ్రి దేవ్‌సింగ్‌కు సందేహం వచ్చి గురువారం నిలదీశాడు. దీంతో ఉపాధ్యాయుడు కొట్టాడని చెప్పగా దేవ్‌సింగ్ పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్ పెన్నీలాను నిలదీశాడు. ఉపాధ్యాయుడు పొరపాటు చేశాడని, మరోసారి పునరావృతం కాకుండా చూస్తామని సర్దిచెప్పి పంపించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా విద్యార్థులను కొట్టడం సరైన పద్ధతి కాదని, మరోమారు జరగదని ఉపాధ్యాయుడితో విద్యార్థి తండ్రికి చెప్పించామని తెలిపారు. అలాగే, ఘటనపై ఎంఈఓ జయరాజు మాట్లాడుతూ పాఠశాల నిర్వాహకులకు నోటీసు ఇవ్వడమే కాక విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



విద్యార్థి పిరుదులపై తేలిన వాతలు

నేటి నుంచి 'దళితబంధు' సర్వే

35 మంది ప్రత్యేక అధికారుల నియామకం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు బోనకల్ మండలాల్లో దళితబంధు లబ్ధిదారుల ఎంపికకు శుక్రవారం నుంచి సర్వే చేయనున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. ఇటీవల జిల్లాకు పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ సత్తుపల్లి నియోజకవర్గమంతటితో పాటు బోనకల్ మండలంలోని దళితులందరికీ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించారు. ఆతర్వాత కొద్దిగంటల్లోనే జీఓ కూడా విడుదలైంది. ఈ నేపథ్యాన గ్రామాల్లో సర్వే కోసం ప్రత్యేకాధికారులను నియమించగా... కలెక్టర్ గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా వారితో సమీక్షించారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం సత్తుపల్లి నియోజకవర్గంలో 25,700 మంది, బోనకల్ మండలంలో 4,592 దళిత కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఆయా కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే చేసేందుకు 35 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు వెల్లడించారు. శుక్రవారం ఉదయం సర్వే ప్రారంభించాలని సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్ల నియామకంపై ఎమ్మెల్యే హర్షం

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతీ దళిత కుటుంబానికి దళితబంధు వర్తింపచేసేలా జీఓ జారీ చేయడమే కాక సర్వే కోసం స్పెషల్ ఆఫీసర్లను నియమించడంపై సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హర్షం వ్యక్తంచేశారు. నియోజకవర్గంలోని అన్నిగ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యాన గ్రామసభలు ఏర్పాటుచేసి దళిత కుటుంబాల స్థితిగతులను తెలుసుకుంటారని ఆయన చెప్పారు. ఈసందర్భంగా దళితులు సర్వే సమయాన గ్రామాల్లో ఉండి అధికారులకు వివరాలు అందజేయాలని సూచించారు. కాగా, నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు అమలుచేయాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

తెరపైకి మళ్లీ 'చెత్త' సమస్య...

డంపింగ్ యార్డ్‌పై స్థానికుల అభ్యంతరాలు

- బీసీ కాలనీ నుంచి వాహనాలు నడపొద్దంటూ ఆందోళన
- బుధవారం రాత్రి యార్డ్‌లో చెలరేగిన మంటలు
- వ్యాపించిన పొగతో ఇబ్బంది పడిన కాలనీవాసులు
- వాహనాలను అడ్డుకొని నిరసన తెలిపిన స్థానికులు





స్థానికుల ఆందోళనలతో నిలిచిపోయిన వాహనాలు (ఇన్‌సెట్) అర్ధరాత్రి డంపింగ్ యార్డ్‌లో మంటలతో కాలుతున్న వ్యర్థాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరం విస్తరించడంతో నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు భారీ సంఖ్యలో పెరిగాయి. వాటి నుంచి వెలువడే వ్యర్థాలు కూడా అదే స్థాయిలో వెలువడుతున్నాయి. కాగా, దశాబ్దాల కాలంగా నగరంలోని రాపర్తినగర్ టీఎన్జీవోస్ కాలనీ సమీపంలో నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్‌పై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డ్‌తో వచ్చే సమస్యలకు చెక్ పెట్టేందుకు అధికారులు పలు రకాల చర్యలు తీసుకుంటున్నా.. అవి తమకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని, సమస్య పునరావృతం అవుతుందంటూ ఆందోళనకు దిగారు. తాజాగా బుధవారం రాత్రి గుర్తు తెలియని కొందరు వ్యక్తులు డంపింగ్ యార్డ్‌లో నిప్పు పెట్టడంతో అర్ధరాత్రి సమయాన వ్యర్థాలకు మంటలు అంటుకొని పెద్ద ఎత్తున పొగ వ్యాపించి పలు ప్రాంతాలను చుట్టుముట్టాయి. దీంతో గురువారం ఉదయం టీఎన్జీవోస్ కాలనీ వాసులు, బీసీ కాలనీ వాసులు యార్డ్‌లోకి చెత్త వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో డంపింగ్ యార్డ్ సమస్య మరోసారి తెరపైకి వచ్చింది.

యార్డ్‌ను తరలించాలని ఆందోళనలు..

గత కొన్నేళ్లుగా రాపర్తినగర్ టీఎన్జీవోస్ కాలనీ సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌ను తరలించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఆందోళనలు చేస్తూ వచ్చారు. రెండేళ్ల క్రితం డంపింగ్ యార్డ్‌ను నగరంలోని 1వ డివిజన్‌లోని ఓ ప్రాంతానికి తరలించగా.. అక్కడి వారు ఆందోళనలు చేయడంతో తిరిగి రాపర్తినగర్ ప్రాంతానికి తరలించారు. డంపింగ్ యార్డ్‌లో పొగలు రాకుండా, వ్యర్థాలు రోడ్లపై పడకుండా యార్డ్‌కు తరలించేలా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే యార్డ్ ఇక్కడకు వచ్చిన నాటి పలు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, యార్డ్‌ను ఇక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆందోళనలు నిర్వహించారు. పలుమార్లు చెత్త వాహనాలు అడ్డుకోగా.. అధికారులు సర్దిచెప్పి యార్డ్‌లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇక డంపింగ్‌యార్డ్‌లో దశాబ్దాలుగా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు కేఎంసీ ఆధ్వర్యాన బయోమైనింగ్ ప్రక్రియను చేపట్టారు.

యార్డ్‌తో ఇబ్బందులు..

డంపింగ్ యార్డ్‌లో చెత్తకు మంటలు అంటుకొని వచ్చే పొగతో ఊపిరి కూడా తీసుకోలేకపోతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇక డంపింగ్ యార్డ్‌కు చుట్టు పక్కల ఉన్న రాపర్తినగర్, బీసీ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీవాసులు వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాల నుంచి వచ్చే దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డ్‌లో మంటలు చెలరేగకుండా, పొగ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వాహనాలను బీసీ కాలనీ మీదుగా కాకుండా వేరే మార్గంలో వాహనాలను తరలించాలని కోరుతున్నారు.



ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

సెక్యూరిటీ ఏర్పాటు చేస్తాం..



డంపింగ్ యార్డ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు తెలిసింది. చెత్తకు అంటున్న మంటలను ఆర్పేందుకు సిబ్బంది వెంటనే ఫైర్ ఇంజన్లతో అక్కడకు చేరుకున్నారు. డంపింగ్‌యార్డ్‌లో చెత్తకు నిప్పు పెట్టే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. నిరంతరం యార్డ్‌ను పర్యవేక్షించేందుకు సెక్యూరిటీని ఏర్పాటు చేస్తాం. యార్డ్‌తో స్థానికులకు సమస్య రాకుండా చూసుకుంటాం.

– ఆదర్శ్ సురభి, కేఎంసీ కమిషనర్

నాలుగు గంటలు నిలిచిన వాహనాలు..

డంపింగ్‌యార్డ్‌లో బుధవారం రాత్రి వ్యాపించిన మంటలు వ్యాపించి పొగ కమ్మేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యార్డ్‌లో మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బందికి చాలా సమయం పట్టడంతో పొగ ఆ ప్రాంతం అంతా దట్టంగా కమ్మేసింది. దీంతో స్థానికులు గురువారం ఉదయం బీసీ కాలనీ వద్ద డంపింగ్‌యార్డ్‌కు వెళ్లే చెత్త వాహనాలను అడ్డుకున్నారు. డంపింగ్ యార్డ్‌ను తరలించాలని, వాహనాలను ఈ మార్గం గుండా వెళ్లనీయమంటూ నినాదాలు చేశారు. స్థానికుల ఆందోళనకు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీల నేతలు మద్దతుగా నిలిచారు. దీంతో అధికారులు స్థానికులతో మాట్లాడి మరోసారి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటామని, వాహనాలను వెళ్లనివ్వాలని సూచించారు. ఆటోల వరకు బీసీ కాలని నుంచి అనుమతివ్వడంతో సిబ్బంది స్వచ్ఛ ఆటోలను బీసీ కాలనీ నుంచి, ట్రాక్టర్లను రామన్నపేట నుంచి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు.